కో-ఆపరేటివ్ రంగం బలోపేతానికి కృషి : తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కో-ఆపరేటివ్ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వపరంగా కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కో-ఆపరేటివ్ రంగం అభివృద్ధికి ఉద్యోగులు కూడా కృషి చేయాలన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణమండపంలో ఆలిండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 8వ జాతీయ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తుమ్మల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తాము ఇచ్చిన హామీల అమలు కోసం కృషి చేస్తున్నామన్నారు. ఎర్రజెండా లేకపోతే ఈ ట్రేడ్ యూనియన్స్ కూడా లేవని గుర్తు చేశారు. కో-ఆపరేటివ్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్లు ఆమోదయోగ్యమైనవని, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కో-ఆపరేటివ్ బ్యాంకులు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ బ్యాంకులతోపాటు కో-ఆపరేటివ్ బ్యాంకులను కూడా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు, ఆలిండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.సురేందర్, నాయకులు మహేందర్‌రెడ్డి, నాగభూషణయ్య, డాక్టర్ మురళీధర్, దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తీర్థప్రసాదములు తీసుకుంటున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠ

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తట్టిఅన్నారం హనుమాన్ నగర్ కాలనీలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో నవగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం ఆలయంలో యంత్ర ప్రతిష్ఠతో పాటు నవగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాధవరం దేవేందర్‌రావు సరిత, జగన్‌మోహన్‌రెడ్డి, కరుణాకర్, భాస్కర్, వేణుగోపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాము, వెంకట రాఘవరెడ్డి, వెంకటరమణరాయుడు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి భూమిపూజ

సరూర్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 9వ డివిజన్‌లోని వేంకటేశ్వరకాలనీలో నూతనంగా చేపట్టనున్న శివాలయం నిర్మాణం పనులకు సంబంధించిన భూమిపూజ శనివారం నిర్వహించారు. మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి హాజరై నిర్మాణ పనులు ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంగారావు, యూత్ కాంగ్రెస్ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, కాంగ్రెస్ నేతలు బంగారి అశోక్, యాతం మహేందర్, బంగారి శంకర్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు : చైర్మన్

చంపాపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి అన్నారు. ఆలయంలో చలువపందిళ్ల ఏర్పాట్లను శనివారం ఈఓ ఎం.శ్రీనివాసశర్మతో కలిసి చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు.

'స్ఫూర్తి'లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో ఆరు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ) శనివారంతో ముగిసింది. ఈ నెల 19న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఇంజనీరింగ్ కాలేజీల నుంచి 50 మంది ప్రొఫెసర్లు హాజరయ్యారు. ఎఫ్‌డీపీలో భాగంగా అటల్ ఎడ్యు స్కిల్స్ సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గూగుల్ కృత్రిమ మేధా సంపత్తిపై ఆచార్యులకు అవగాహన కల్పించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ఎస్వీ పవన్‌కుమార్ వారికి పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కళాశాల కార్యదర్శి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్, డీన్ సహా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రన్నింగ్ బస్సునుంచి జారిపడి వ్యక్తి మృతి

- ఎక్కువ మంది ఉండడంతో డోరు వద్ద నిల్చున్న ప్రయాణికుడు
- పట్టుతప్పి కిందకి జారిపడడంతో తలకు తీవ్రగాయాలై దుర్మరణం
- రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

ఆదిభట్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : రన్నింగ్ బస్సులో నుంచి జారిపడి తలకు బలమైన గాయాలు కావడంతో ఓ ప్రయాణికుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మేడు గ్రామానికి చెందిన నదిరి రమేష్ ప్లంబర్‌గా పని చేస్తుండేవాడు. తుర్కయాంజాల్‌లో పని ముగించుకొని శనివారం సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్ 07యూకే 4885)లో బయలుదేరాడు. ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో ముందు డోర్ వద్ద నిల్చోన్నాడు. బస్సు తుర్కయాంజాల్ నుంచి బయలుదేరి కొద్దిదూరం పోగానే పట్టు తప్పడంతో కిందకు జారి పడిపోయాడు. వేగంగా వెళ్తున్న బస్సులో నుంచి జారి పడడంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. దాంతో రమేష్(36) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చంద్రశేఖర్‌గౌడ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ శనివారం కలెక్టర్ శశాంక్ ను చేవెళ్లలో మర్యాదపూర్వంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా రవా ణా శాఖలో జరిగిన బదిలీల్లో భాగం గా రంగారెడ్డి జిల్లా రవాణశాఖ అధికారి ప్రవీణ్‌రావు రాష్ట్ర కార్యాలయానికి బదిలీ అయ్యారు. కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన మామిం డ్ల చంద్రశేఖర్‌గౌడ్ రంగారెడ్డి జిల్లా రవాణ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. చేవెళ్లలో ఈనెల 27న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన కలెక్టర్‌ను ఆయన కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇంకా షాక్‌లోనే..

(5వ పేజీ తరువాయి)

ఫలితం లేకుండా పోయింది.' అంటూ తల్లి గీత కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆమె ఇక లేదన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేక దుఃఖసాగరంలో మునిగిపోతున్న తల్లి గీతను చూసి ప్రతి ఒక్కరి గుండె తరుక్కుపోతోంది.

దుఃఖ సంద్రంలో నివేదిత

లాస్య నందిత సగం ప్రాణంగా, మంచి అక్కగా అందరికీ సుపరిచితురాలైన నివేదిత పరిస్థితి మరీ దయనీయంగా మారింది. లాస్య మరణ వార్త విన్నప్పటి నుంచి నివేదిత రోదిస్తూనే ఉన్నారు. ఎవరి కనిపించినా, ఎవరు పలకరించినా దుఃఖం కట్టలు తెంచుకుంటోంది. కార్ఖానలోని సాయన్న నివాసానికి వచ్చే ప్రతి ఓ క్కరినీ అక్కాచెల్లెళ్లు నివేదిత, లాస్య నందితలు ఆప్యాయంగా పలకరిస్తుంటారు. లాస్య మృతితో నివేదిత దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ క్షణం నుంచి ఈ క్షణం వర కూ రోదిస్తూనే ఉన్నారు. సాయన్న ఇంట్లో కాలు పెట్టగానే నవ్వుతూ దర్శనమిచ్చే అక్కాచెల్లెళ్లలో చెల్లి లేదన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేక నిర్వేదానికి గురవుతున్నారు.

మీర్‌పేట్ కౌన్సిల్ సమావేశానికి 'అవిశ్వాసం' ఎఫెక్ట్

- సగం మంది సభ్యులతోనే ఎజెండాకు ఆమోదం
- 46 మంది కార్పొరేటర్లలో 26 మంది డుమ్మా
- 20 మంది సభ్యులు, ముగ్గురు కోఆప్షన్ మెంబర్లు హాజరు



హాజరైన కార్పొరేటర్లు



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశానికి 'అవిశ్వాసం' ఎఫెక్ట్ పడింది.. ఇక్కడి మేయర్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ 31 మంది సభ్యులు గురువారం కలెక్టర్‌కు లేఖ అందజేసిన నేపథ్యంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశం వెలవెలబోయింది. కనీసం సగం మంది సభ్యులు కూడా హాజరు కాకపోగా, కోఆప్షన్ సభ్యులదీ అదే పరిస్థితి! దాంతో 'కోరమ్'కు సరిపోయేంత మంది సభ్యులు రాగానే సమావేశాన్ని ప్రారంభించి, హాజరైన సభ్యుల సమక్షంలో ఎజెండాలోని అంశాలను చర్చించి ఆమోదం తెలిపారు. ఇక మేయర్‌పై అవిశ్వాసం ప్రకటించిన 14మంది బీజేపీ సభ్యుల్లో ఏడుగురు సభ్యులు సమావేశానికి హాజరుకాగా మిగతా ఏడుగురు డుమ్మా కొట్టారు. 12మంది బీఆర్ఎస్ సభ్యులు పాల్గొనగా, అవిశ్వాసం లేఖపై సంతకం చేసిన ఓ బీఆర్ఎస్ సభ్యురాలు సైతం హాజరవడం గమనార్హం! ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు కూడా గైర్హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి అవిశ్వాసం లేఖపై సంతకాలు చేసిన సభ్యులెవరూ కూడా కౌన్సిల్ సమావేశానికి రాలేదు. దాంతో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాన్ని 'కోరమ్'కు సరిపోయేంత మంది(16 కన్నా ఎక్కువ) సభ్యులు రాగానే మొదలుపెట్టారు. 26మంది కార్పొరేటర్లు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు కలిపి మొత్తం 28మంది గైర్హాజరుకాగా, 20మంది కార్పొరేటర్లు, ముగ్గురు కోఆప్షన్ సభ్యులతో కలిపి మొత్తం 23మందితోనే సమావేశాన్ని సాదాసీదాగా కొనసాగించారు. దాంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చివరిదిగా పేర్కొంటున్న శనివారం నాటి కౌన్సిల్ సమావేశం చప్పగా సాగింది. 'అవిశ్వాసం' ఎఫెక్ట్ బాగానే కనిపించిందని అధికారవర్గాలు, రాజకీయ పార్టీల నేతలు పేర్కొన్నారు.

ఎస్‌డీఎఫ్ నిధులు వెంటనే విడుదల చేయాలి: సబితారెడ్డి

స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) కింద గత ప్రభుత్వం హయాంలో నాటి సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించిన నిధులను కొత్త ప్రభుత్వం రద్దు చేయడం సబబు కాదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. వెంటనే సదరు ఎస్‌డీఎఫ్ నిధులను విడుదల చేసి అభివృద్ధి కొనసాగేలా చూడాలని ఆమె సూచించారు. శనివారంనాటి మీర్‌పేట్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సబిత మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వివిధ అభివృద్ధి పనులు చేపట్టే నిమిత్తం గతేడాది మాజీ సీఎం కేసీఆర్ మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లకు రూ.50 కోట్లు చొప్పున, జల్‌పల్లి, తుక్కుగూడ మునిసిపాలిటీలకు రూ.25 కోట్లు చొప్పున మొత్తం రూ.150కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. సదరు నిధులతో ఆయా ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయని ఆమె అన్నారు. అయితే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నిధులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించిందని, ఇది అభివృద్ధిని అడ్డుకోవడమేనని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎస్‌డీఎఫ్ నిధులను విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్పొరేషన్ల అభివృద్ధికి తామెంతో కృషి చేశామని, ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడంలేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మునిసిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, కమిషనర్ బి.చంద్రశేఖర్, బీఆర్ఎస్, బీజేపీ ఫ్లోర్ లీడర్లు భూపాల్‌రెడ్డి, కీసరి గోవర్ధన్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ ఎన్వీఎస్ ఆంజనేయులు, డీఈఈ గోపీనాథ్, టీపీవో దేవానంద్, ఏఈ శ్రీనివాసులు, మేనేజర్ ఎన్.వెంకట్‌రెడ్డి, ఆర్వో డి.అంజన్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక విద్య, సాంకేతిక వైజ్ఞానిక ప్రయోగాలతోనే కొత్త ఇన్నోవేషన్లకు వేదిక

- డీఆర్డీవో శాస్త్రవేత్త డాక్టర్ కరుణానిధి సుబ్రహ్మణ్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీవో శాస్త్రవేత్త డాక్టర్ కరుణానిధి సుబ్రహ్మణ్యం

చాదర్‌ఘాట్. ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక విద్యకు సాంకేతిక వైజ్ఞానిక ప్రయోగాలు తోడై కొత్త కొత్త ఇన్నోవేషన్లకు వేదికగా మారుతుందని డీఆర్డీవో శాస్త్రవేత్త డాక్టర్ కరుణానిధి సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని అనిబిసెంట్ మహిళ డిగ్రీ కళాశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆధ్యాత్మిక విలువలతో కూడుకున్న వైజ్ఞానిక విద్య దాని ఆవశ్యకత అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంకేతికతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. వీటికి తోడుగా ఆధునిక విద్య, సాంకేతిక వైజ్ఞానిక ప్రయోగాలు తోడైతే సాధిస్తున్న అద్భుతాలు ఎన్నో కళ్ల ముందు కదలాడుతున్నాయన్నారు. ఇంకా ఎన్నో కొత్త కొత్త ఇన్నోవేషన్లు ఆవిష్కృతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేటి తరం విద్యార్థులు వీటికి పోటీపడాలని ఆయన పిలుపునిచ్చారు. అప్పుడే విద్యార్థులకు వాటిపై పట్టు సాధించడంతోపాటు కొత్తకొత్త ఇన్నోవేషన్లను వెలికి తీయడంలో ప్రత్యేక గుర్తింపు పొందుతారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు రంగోలి ద్వారా సాంకేతిక వైజ్ఞానిక ప్రదర్శనలు చేసి అందరిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజవల్లి, ఏవో రవీందర్ పాల్గొన్నారు.

చంచల్‌గూడ డిగ్రీ కళాశాలలో నాక్ ప్రతినిధుల అధ్యయనం



నాక్ ప్రతినిధుల బృందానికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ (నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ ఎక్రిడిటేషన్ కౌన్సిల్) ప్రతినిధుల బృందం రెండు రోజుల పాటు అధ్యయనం చేసింది. శుక్రవారం ప్రారంభమైన నాక్ ప్రతినిధుల అధ్యయనం శనివారం ముగిసింది. ముగ్గురు ప్రొఫెసర్లతో కూడిన ప్రతినిధుల బృందం చంచల్‌గూడలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్లు, పరీక్షల్లో సాధిస్తున్న ఫలితాలు, వారికి అందుతున్న స్కాలర్ షిప్‌లు, కళాశాలలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, పరిశోధనలు, వాటి విస్తరణపై అధ్యయనం చేసింది. అనంతరం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్పొరేటర్ సలాం షాహిద్ మూన్ నాక్ ప్రతినిధుల అధ్యయన బృందానికి ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం, అందులో కల్పించనున్న మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యే వివరించారు. ఎన్జీవో నాంది ఫౌండేషన్ ప్రతినిధి అహ్మదీ, నెహ్రూ యువక కేంద్రం నుంచి ఖుషీ గుప్తా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూలపల్లి వెంకటరమణ తదితరులు అధ్యయన బృందానికి అవసరమైన వివరాలను అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

యూజీసీ నిబంధనల ప్రకారమే సీనియర్ ప్రొఫెసర్లకు పదోన్నతులు

- ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ

తార్నాక, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయంటూ పలు దినపత్రికల్లో వస్తున్న వార్తలు నిరాధారమైనవని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ఈ మేరకు ఓయూలోని గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూజీసీ నిబంధనలకు అనుగుణంగానే పదోన్నతుల ప్రక్రియ జరిగిందని, జీవో నెం. 15 అనుసరించి, యూజీసీ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించామన్నారు. ఏమైనా అనుమానాలుంటే అడ్మినిస్ట్రేటివ్ అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఎంతో పేరు ప్రఖ్యాతలున్న ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను కాపాడేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న గాంధీనగర్ ఐఐటీ, ఈసీఐఎల్ సంస్థల అధికారులు

గుజరాత్‌లోని గాంధీనగర్ ఐఐటీతో ఈసీఐఎల్ ఒప్పందం

కుషాయిగూడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఈసీఐఎల్ సంస్థ మరో భారీ పరిశోధన ప్రాజెక్టును దక్కించుకుంది. గుజరాత్ గాంధీనగర్‌లోని ఐఐటీతో అటానమస్ నేవిగేషన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్/మెషీన్‌లెర్నింగ్ (ఏఐ/ఎంఎల్) అప్లికేషన్‌ల రూపకల్పన, సెక్యూరిటీ విభాగానికి సంబంధించి ఇమేజ్ ప్రాసెసింగ్ టెక్నిక్స్ అంశాలలో సంయుక్తంగా పరిశోధనలు చేసేందుకు అంగీకరించింది. ఈమేరకు శనివారం గాంధీనగర్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ రజత్ మూనా, ఈసీఐఎల్ పర్సనల్ డైరెక్టర్ డాక్టర్ అనేష్ కుమార్ శర్మ పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కాగా, ఈనెల 16న గాంధీనగర్ ఐఐటీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రొఫెసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ పి.మెహరోత్రా, ఈసీఐఎల్ జనరల్ మేనేజర్ సి.మురళీధర్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

సున్నితమైన పోలింగ్ కేంద్రాలపై అధికారులకు శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సైబరాబాద్‌లోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ఇతర అధికారులతో పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి ఆదేశాల మేరకు శిక్షణా కార్యక్రమం జరిగింది. సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించే విషయమై శనివారం సైబరాబాద్ కమిషనరేట్‌లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో కమిషనరేట్‌కు చెందిన 100 మంది అధికారులు హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమంలో సెక్టార్ పోలీస్ అధికారులు, రెవెన్యూ సెక్టార్ అధికారుల సమన్వయంతో సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, గుర్తించిన కేంద్రం సున్నితమైందని చెప్పడానికి కారణాలేంటనే అంశాలతో జిల్లా ఎన్నికల అధికారికి పంపించేందుకు రిపోర్టు సిద్ధం చేయడం, ఆయా ప్రాంతాల్లో ఓటు వేసేలా పౌరుల్లో అవగాహన కల్పించడం, శాంతిభద్రతలను కాపాడుతూ ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన ఏర్పాట్లు, జాగ్రత్తల గురించి వివరించారు.

రుణాల పేరిట దగా

రూ.5కోట్లు ఇస్తానంటూ మహారాష్ట్ర వాసికి టోకరా
అడ్వాన్స్‌గా రూ. 50లక్షలు తీసుకుని పరారీ
ఇద్దరి అరెస్టు.. రూ. 46లక్షలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ: రుణాలిప్పిస్తామంటూ నమ్మించి మోసం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మీర్‌పేట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద రూ. 46 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర, అహ్మద్‌నగర్‌కు చెందిన బన్సీలాల్ శర్మ (53) రత్నగిరి తాలూకా రాజాపూర్‌లో రూ. 5 కోట్లతో జమీర్ నిజామ్ ఖలీఫా వద్ద 15 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేయాలనుకున్నాడు. అంత డబ్బు లేకపోవడంతో గతేడాది పుణెలో పరిచయమైన హైదరాబాద్‌కు చెందిన ఫైనాన్సర్ సురేందర్ రెడ్డిని కలిశాడు. రుణం ఇప్పించే ప్రక్రియలో ఎరుకల విజయ్, వెంకటేశ్, మహేశ్‌లను సురేందర్‌రెడ్డి..బన్సీలాల్‌కు పరిచయం చేశాడు. నిబంధనల ప్రకారం రూ. 5 కోట్ల రుణం ఖాతాలోకి బదిలీ చేయాలంటే సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ. 50 లక్షలు చెల్లించాలని సురేందర్‌రెడ్డి కోరాడు. దానికి ఒప్పుకున్న బన్సీలాల్ రూ. 25 లక్షలు అప్పు ఇవ్వాలని జమీర్ నిజామ్‌ను కోరాడు. అంగీకరించిన జమీర్ కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 19న జిల్లెలగూడ స్వాగత్ గ్రాండ్ హోటల్ వద్దకు వచ్చాడు. బన్సీలాల్ కూడా రూ. 25 లక్షలతో హోటల్ వద్దకు రాగా సురేందర్‌రెడ్డి అనుచరుడు వెంకట్ నాని వారి వద్ద రూ. 50 లక్షలు తీసుకునే ప్రయత్నం చేశాడు. వారు నిరాకరించినా నమ్మించి బలవంతంగా డబ్బు తీసుకుని పారిపోయాడు. ఆ తర్వాత నాని, సురేందర్‌రెడ్డి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. మోసపోయామని గ్రహించిన బాధితులు మీర్‌పేట్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి ప్రధాన నిందితుడైన సురేందర్‌రెడ్డి, ఎరుకల విజయ్ అలియాస్ అర్జున్‌ను అరెస్టు చేశారు. వెంకటేశ్ అలియాస్ వెంకట్ నాని, మహేశ్ పరారీలో ఉన్నారు.

ఎయిర్‌పోర్టుల తరహాలో రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణ

- 26న ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన

హైదరాబాద్ : ఎయిర్ పోర్టుల తరహాలో రైల్వే స్టేషన్లను ఆధునికీకరించనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ తెలిపారు. జోన్ పరిధిలో సుమారు రూ.1800 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన, పూర్తి చేసిన పనులకు ఫిబ్రవరి 26న ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. శనివారం రైల్ నిలయంలో అరుణ్‌కుమార్ జైన్ విలేకరులతో మాట్లాడుతూ తమ జోన్ పరిధిలో సుమారు రూ.925 కోట్ల వ్యయంతో 57 రైల్వే స్టేషన్‌లను ఆధునికీకరించనున్నట్టు తెలిపారు. ఇందులో తెలంగాణలో 15 స్టేషన్‌లు, ఆంధ్రప్రదేశ్‌లో 34స్టేషన్లను అమృత్ స్టేషన్‌ల కింద అభివృద్ధి చేయనున్నట్టు వివరించారు. తెలంగాణలో చేపట్టనున్న అమృత్ స్టేషన్‌ల అభివృద్ధి కోసం రూ.230 కోట్లకు పైగా నిధులు వ్యయం చేయనున్నారు. ప్రధానంగా దేశ వ్యాప్తంగా రైల్వే స్టేషన్‌లను ఎయిర్‌పోర్టుల మాదిరిగా అభివృద్ధి చేసే లక్ష్యంతో కోట్లాది నిధులతో సౌకర్యాలను మెరుగుపరిచి ఆధునికీకరించనున్నట్టు తెలిపారు.

ఇన్‌స్పైర్ సైన్స్ పోటీలకు ఎంపిక

బోయినపల్లి : ప్రతిష్టాత్మక 2024 రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల బోయినపల్లికి చెందిన 10వ తరగతి విద్యార్థి ఇంద్రజిత్ ఎంపికయ్యాడు. ఇన్‌స్పైర్ మనక్ పేరిట రాష్ట్రస్థాయి ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవాలు సీబీఎస్ఈ జాతీయ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ క్రమంలో 2023 వరకు తెలంగాణలోని సీబీఎస్ఈ పాఠశాలలో చదువుతున్న 127 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఇటీవల ఆన్‌లైన్ విధానంలో ఎంపికచేశారు. అందులోంచి రెండురోజుల క్రితం 13 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అందులో సెయింట్ పీటర్స్ పాఠశాల విద్యార్థి ఇంద్రజిత్ తయారు చేసిన బ్యాటరీతో నడిచే వీల్‌చైర్‌ను ఇన్‌స్పైర్ సైన్స్ పోటీల నిర్వాహకులు టాప్ వన్‌గా ఎంపిక చేశారు. అభినందన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారులు ధర్మేందర్‌రావు, ఆర్. రోహిణి, పాఠశాల యాజమాన్యం, సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల అధిపతి అల్ఫోన్స్‌రెడ్డి, అకాడమి డైరెక్టర్ టి.అరుణ రెడ్డి ఇంద్రజిత్‌ను ఘనంగా అభినందించి సత్కరించారు.

ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ పోస్టులను ప్రకటించండి



మంత్రి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్వహించే మెగా డీఎస్సీ, టీఆర్‌టీలో ఖాళీగా ఉన్న ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ పోస్టులను ప్రకటించాలని తెలంగాణ ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ నిరుద్యోగుల అసోసియేషన్‌ప్రతినిధులు మంత్రి జూపల్లి కృష్ణారావును శనివారం మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముప్పై సంవత్సరాల నుంచి డీఎస్సీలో డ్రాయింగ్ పోస్టుల ఊసే లేదన్నారు. మెగా డీఎస్సీ, టీఆర్‌టీలో ఖాళీగా ఉన్న ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులను ప్రకటించి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ నిరుద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు కర్నె రాజన్‌చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అశోక్‌కుమార్, ఎం.రాజుయాదవ్, ప్రధాన కార్యదర్శి ఎండీ వహీద్‌అలీ, ఉపాధ్యక్షులు సాహెద బేగం, బీ.రాజశ్రీ, కె.అనిల్, ఎన్.నందిని పాల్గొన్నారు.

మలేషియాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తే.. అదనంగా ఒక సంవత్సరం గడిపే అవకాశం !

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యుత్తమమైన యూనివర్సిటీలలో కొన్ని మలేషియాలో ఉన్నాయి. టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, మెడిసన్ తదితర రంగాలలో తమ యూనివర్సిటీలకు అంతర్జాతీయంగా టాప్ 50 యూనివర్సిటీలలో స్థానం లభించిందన్నారు ఎడ్యుకేషన్ మలేషియా గ్లోబల్ సర్వీసెస్ (ఈఎంజీఎస్) సీఈఓ నోవి తాజుద్దీన్. నగరంలో మొదటిసారిగా బేగంపేటలోని ఓ హోటల్‌లో మలేషియా ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను శనివారం నిర్వహించారు. మలేషియాలో అత్యుత్తమ యూనివర్సిటీలలో 8 యూనివర్సిటీల ప్రతినిధులు హాజరైన ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు నగరంలోని పలు మైనారిటీ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఈఎంజీఎస్ సీఈఓ నోవి మాట్లాడుతూ తొలిసారిగా ఇండియాలో తాము ఈ రోడ్‌షోలను చేస్తున్నామన్నారు. ఇప్పటికే చెన్నై, ఏపీలలో తమ ఎడ్యుకేషన్ ఫెయిర్ షోలను చేశామంటూ ఇక్కడ విద్యార్థుల నుంచి వస్తోన్న స్పందన అపూర్వమన్నారు. ఇటీవలే భారతీయ విద్యార్థుల కోసం తమ ప్రభుత్వం పోస్ట్ గ్రాడ్యుయేట్ వీసా తీసుకువచ్చిందంటూ, తమ విద్య ముగిసిన తరువాత కూడా ఓ సంవత్సరం పాటు విద్యార్థులు అక్కడ గడిపే అవకాశం ఉందన్నారు. అలాగే ఓ సంవత్సరం ఉద్యోగం చేసే అవకాశం కూడా లభిస్తుందన్నారు. మలేషియా హానరరీ కాన్సుల్ జనరల్, సౌత్ ఇండియా కె శరవణ కుమార్ మాట్లాడుతూ మలేషియాలో అంతర్జాతీయ విద్యార్థులకు అపార అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో ఏసియా పసిఫిక్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్, సన్‌వే, తునుకు అబ్దుల్ రెహమాన్ యూనివర్సిటీ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి

రంగారెడ్డి జిల్లా కోర్టులు: రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో శనివారం సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్, బంజార సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. జిల్లా జడ్జిలు, బంజార కమిటీ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

'బ్రెడ్ విన్నర్ స్కీం'లో ఉద్యోగం కల్పించాలి

హైదరాబాద్: సర్వీసులో ఉండి చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించే 'బ్రెడ్ విన్నర్ స్కీం'లో దరఖాస్తు దారులందరికీ అర్హతల ఆధారంగా ఉద్యోగం ఇవ్వాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వీఎస్‌రావు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌కు శనివారం వారు వినతిపత్రం ఇచ్చారు.